
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
3★★★ జిల్లా వార్తలు
సోమవారం 2 జూన్ 2025



మరపురాని స్మృతులెన్నో..



పాడుతున్న విమలక్క...

- ఉద్యమ జ్ఞాపకాల్లో పోరుగడ్డ సిరిసిల్ల
- జిల్లాలో 22 మంది బలిదానాలు
- సిరిసిల్ల నుంచి ఢిల్లీకి వెళ్లిన కేసీఆర్
- నేడు తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సర్వం సిద్ధం
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సిరిసిల్లలో నినాదాలు చేస్తున్న న్యాయవాదులు



సిరిసిల్ల మానేరు వాగు బ్రిడ్జిపైన 2009లో ఢిల్లీకి వెళ్తూ దుస్తులు మార్చుకుంటున్న కేసీఆర్

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

రగిలిన గుండెల్లో రక్తం ఎగజిమ్మిన వెచ్చటి సూర్యోదయం. దొరల గడీల మధ్య అణచబడ్డ మట్టి ఆత్మఘోష. తెలంగాణ రైతాంగ పోరాటాల మధ్య చైతన్యవంతమైన సిరిసిల్ల పల్లెలు తెలంగాణ సాధన కోసం గొంతెత్తి పిడికిలి బిగించాయి. రాజన్న సిరిసిల్ల జనం తెలంగాణ మహోద్యమంలో తనదైన పాత్రను పోషించింది. సకల జనుల సమ్మె, ధూంధాంలతో సాధించుకున్న తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర స్మృతులతో 11 ఏళ్ల పూర్తి చేసుకోవడమే కాకుండా రాజన్న సిరిసిల్ల జిల్లాగా పాలన సౌకర్యం చేరువకాగా, కొత్త మండలాలు, కొత్త గ్రామ పంచాయతీలతో అభివృద్ధి పథంలో ముందడుగు వేసింది. గడిచిన ప్రభుత్వ హయాంలో పదేళ్ల ప్రగతి పథంలోనే సిరిసిల్ల జిల్లా రాష్ట్రంలో ప్రత్యేకతను సాధిస్తూ సమగ్రాభివృద్ధి దిశగా ముందుకు సాగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఆరు గ్యారంటీలతో సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతుండగా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి వైపు అడుగులు పడ్డాయి. మల్కపేట రిజర్వాయర్‌లోకి నీళ్లు నింపి రైతులకు అందించే కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ ఉద్యమంలో జిల్లాలో ఉద్యోగులు, ప్రజలు, వివిధ రాజకీయ పార్టీలు సంస్థలు తెలంగాణ ఉద్యమ బాటలో సకల జనుల సమ్మెలో వంద రోజులకు పైగా రిలే దీక్షలను కొనసాగించి. ఉద్యమాన్ని మలుపు తిప్పడంతో ముందు వరుసలో నిలిచారు. జాయింట్ యాక్షన్ కమిటీలు, ఉద్యోగుల సంఘాలు ఉద్యమజోరును పెంచాయి. తెలంగాణ ఉద్యమం కోసం ఇంటర్మీడియేట్ విద్యార్థుల నుంచి కులవత్తులు చేసుకునే రైతుల వరకు ఆత్మబలిదానాలు చేశారు. ఉమ్మడి జిల్లాలో 162మంది అమరులు ఉండగా, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 22 మంది ఉన్నారు.

ప్రధాన సంఘటనల్లోకి వెళ్తే..

తెలంగాణ ఉద్యమ సారధి ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు 2001 ఏప్రిల్ 27న హైదరాబాద్‌లో టీఆర్ఎస్‌కు ఊపిరి పోశారు. అదే సంవత్సరం మే 14న ఉమ్మడి జిల్లా కరీంనగర్‌లో సింహగర్జన పేరుతో తొలి బహిరంగ సభను నిర్వహించారు. అందులో సిరిసిల్ల ప్రజలు కేంద్ర బిందువుగా మారారు. కేసీఆర్ 2009 నవంబర్ 8న దీక్షకు ముందు ఢిల్లీలో అన్ని పార్టీల మద్దతును పొందడానికి వెళ్లే సమయంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలను నిర్వహించారు. అనంతరం సిరిసిల్ల మానేరు వాగు పైనే తన పూజ బట్టలను మార్చుకొని నేరుగా ఢిల్లీకి వెళ్లారు. సిరిసిల్ల గడ్డపై సీమాంధ్రుల నేతలను అడుగు పెట్టనివ్వకుండా తరిమికొట్టిన సందర్భం మరిచి పోనిది. 2012లో వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షురాలు విజయలక్ష్మి సిరిసిల్ల నేత కార్మికులను పరామర్శించే పేరుతో వచ్చిన ఆ క్షణాలు సిరిసిల్ల రణరంగంగా మారింది. తెలంగాణ వాదులు భారీ పోలీసు బందోబస్తును ఛేదించి ఆమెను అడ్డుకోగా, సభను జరిపామనుకుంటూ వెళ్లిపోయారు. సిరిసిల్ల న్యాయవాదులు కోర్టుపైన నల్ల జెండాలు ఎగరవేశారు. ఢిల్లీలో సైతం న్యాయవాదులు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. సకల జనుల సమ్మెలో భాగంగా...... మిగతా 6లో



రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

భక్తజన సంద్రంగా రాజన్న ఆలయం...

- 70 వేలకు పైగా రాజన్నను దర్శించుకున్న భక్తులు..
- రాజన్న దర్శనానికి నాలుగు గంటల సమయం..

5

సువిశాలమైన గోశాల నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టాలి

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు సూచించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

5

రాజన్న కోడెల సంరక్షణకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- పశు వైద్యాధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు చికిత్సలు
- 32 మందికి రెండు చొప్పున 64 కోడెల పంపిణీ

5

రాజన్న గోశాల నిర్వహణలో పూర్తి నిర్లక్ష్యం..

- బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు



సమావేశంలో మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయ గోశాలలోని కోడెల సంరక్షణపై నిర్లక్ష్యం వహిస్తున్నారని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆరోపించారు. పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్థానిక శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్ కోడెల మృత్యువాత పడుతున్న ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణలోని ఏ ఇంట్లో శుభకార్యం జరిగినా ముందుగా రాజన్నకు మొక్కులు చెల్లించుకునే ఆనవాయితీలో భాగంగా నిత్యం స్వామివారికి కోడెలు సమర్పిస్తున్నారని తెలిపారు. మరోవైపు గుడి బంద్ చేస్తారన్న ప్రచారంలో భాగంగా భక్తులు ప్రతినిత్యం వేలాదిగా తరలివస్తూ అత్యంత ప్రీతిపాత్రమైన స్వామివారికి నిజకోడెను కూడా భక్తులు సమర్పించుకుంటున్నారని తెలిపారు. ఆరు మాసాలుగా కోడెల పంపిణీ ప్రక్రియ నిలిచిపోగా, దీంతో తిప్పాపూర్ గోశాలలో కేవలం 500 కోడెలు మాత్రమే ఉంచే స్థలంలో 1200కు పైగా కోడెలను ఉంచడం ద్వారా అనారోగ్యం బారినపడి సరైన ఆహారం అందక మృత్యువాత పడుతున్నాయన్నారు. పశువైద్యాధికారులే నిర్ధారించడం దురదృష్టకరమన్నారు. స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడె మొక్కు ద్వారా యేటా 22 కోట్ల ఆదాయం వస్తుండగా కనీసం వాటికి ఆహారం పెట్టలేని దుస్థితిలో రాజన్న ఆలయ అధికారులు, ప్రభుత్వం ఉండడం దురదృష్టకరమన్నారు. 500 చోట 1200కు పైగా కోడెలు ఉండడం కనీస ఆహారం లేక మృతిచెందడంలో అధికారులు, నాయకులకు కనీస మానవత్వం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన తర్వాత మాత్రమే అధికారులు హడావిడి చేస్తూ పంపిణీకి సిద్ధమవుతున్నట్లు కలెక్టర్ ప్రకటన చేస్తున్నారని, గతంలో జరిగిన అవకతవకలను దృష్టిలో పెట్టుకొని తప్పనిసరిగా పకడ్బందీగా పంపిణీ జరగాలని సూచించారు. ఇకపై రాజన్న కోడెలకు శాశ్వత పరిష్కారంగా 50 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి వాటిని కాపాడి భక్తుల మనోభావాలను గౌరవించాలన్నారు. ఏనుగు మనోహర్‌రెడ్డి, రామతీర్థపు రాజు తదితరులున్నారు.

వంతెనల నిర్మాణం చేపట్టాలి



పెంటి వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతున్న నాయకులు

కోనరావుపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు మిరియాల బాలాజీ కోరారు. మండలంలోని పెంటివాగు బ్రిడ్జి, మూలవాగు కాజ్‌వేలను పరిశీలించి మాట్లాడారు. గతంలో మూలవాగులో కొట్టుకపోయిన కాజ్‌వేలకు నిమ్మపల్లి, కోనరావుపేట బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని కోరారు. మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, మాజీ వైస్‌ఎంపీపీ తీగల రవీందర్ గౌడ్, నందగిరి నారాయణ, సురేష్, జయశ్రీ, తిరుపతి, ముష్టం శ్రీనివాస్, మల్లేశం, విజయ్, యశోద, రాజు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్‌లకు స్లాట్ బుకింగ్

- దస్తావేజులపై నిఘా నేత్రం - జిల్లాలో నేటి నుంచే అమలు..



సిరిసిల్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సిరిసిల్ల క్రైం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇకనుంచి కమర్షియల్, నివాస స్థలాల రిజిస్ట్రేషన్‌లకు స్లాట్ బుకింగ్ విధానం ప్రవేశపెట్టింది. ఈవిధానం సోమవారం నుంచి అమలులోకి తీసుకువచ్చింది. దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు ఇకనుంచి తప్పనిసరిగా స్లాట్‌బుకింగ్ చేసుకోవాలి. కొంతకాలంగా కొన్ని ప్రాంతాలకే ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ విధానాన్ని రాష్ట్రంలోని 144సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలులోకి తీసుకువచ్చింది. ఇకనుంచి ప్లాట్స్, ఇళ్లు, భవంతులు, వ్యవసాయేతర భూములకు స్లాట్ బుకింగ్ ఉంటేనే డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ అవుతుంది. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సోమవారం నుంచి అమలులోకి వస్తుంది.

48 స్లాట్ బుకింగ్‌లు..

జిల్లాలోని ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి 48 స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. ప్రతిరోజు స్లాట్‌బుకింగ్‌కు 48 డాక్యుమెంట్లకే అవకాశం ఇచ్చారు. దీంతో సిరిసిల్లలో 48, వేములవాడలో 48 స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. స్లాట్ బుకింగ్‌లోనే పబ్లిక్ డాటా ఎంట్రి చేయించుకోవాలి. ఈ స్లాట్ బుకింగ్ చేసుకున్నవారికి మెస్సెజ్ వస్తుంది. ఎవరి స్లాట్ ఏ సమయంలో అయితే అదే సమయంలో రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లోనే ప్రతి డాక్యుమెంట్ జనరేట్ అవుతుంది. తర్వాత డాక్యుమెంట్ ప్రింట్ తీసుకొని నిర్ణీత సమయంలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి చేరుకోవాలి. స్లాట్ బుకింగ్‌లోనే పబ్లిక్ డాటా ఎంట్రి చేయించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ప్రధానంగా భూములు, వివాహాలు, ఇతరత్రా రిజిస్ట్రేషన్‌ల కోసం కార్యాయాలకు అనేకమంది వస్తుంటారు. మరోవైపు బ్యాంకు రుణాల కోసం తాకట్టు పెట్టే ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం వచ్చేవారి సంఖ్య పెరిగింది. ఏదైనా భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే రెండుమూడు రోజులు తిరుగాల్సిన పరిస్థితిఉండేది. స్లాట్‌బుకింగ్ వల్ల రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నిరీక్షణకు తెరపడనుంది.

ప్రతి డాక్యుమెంట్‌పై నిఘా నేత్రం..

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నిఘా తీవ్రతరం చేశారు. ఇందుకోసం సీసీ కెమెరాలను బిగించి టీవీని అమర్చారు. రిజిస్ట్రేషన్ అయ్యే ప్రతి డాక్యుమెంట్‌ను సీసీ కెమెరాలో బంధించాలనే నిబంధన ఉంది. ఈ నిబంధన ప్రకారం సీసీ కెమెరాలో రికార్డు అయిన డాక్యుమెంట్ ప్రతిని సీడీ ద్వారా ఇవ్వాలి. ఇందుకోసం సబ్ రిజిస్ట్రార్‌కు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు ప్రకారం రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పూర్తి వీడియో చిత్రాన్ని సీడీ ద్వారా అందజేయాలి. నిఘానేత్రం ద్వారా అవినీతి అక్రమాలకు తావుండదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరుగుతున్న ప్రతి రిజిస్ట్రేషన్‌పై నిఘా తప్పనిసరిగా ఉండాలని నిబంధన విధించారు. దీంతో కొనుగోలు, అమ్మకం దారులు తప్పకుండా సబ్ రిజిస్ట్రార్ వద్దకు వచ్చి అన్ని సక్రమమేనని తెలిపిన తర్వాతనే రిజిస్ట్రేషన్ చేయడానికి అనుమతి ఇస్తారు. ఏదైనా అభ్యంతరాలు ఉంటే డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ అయ్యే అవకాశం లేదు.

కమిషనర్ కార్యాలయానికి అనుసంధానం..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను జిల్లా, రాష్ట్ర రిజిస్ట్రార్ కార్యాలయాలకు అనుసంధానం చేశారు. ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పనులను జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులు చూసే విధంగా ఏర్పాటు చేశారు. దీంతో రిజిస్ట్రేషన్ విధానంలో లోపభూయిష్టం కాకుండా ఉంటుంది. సీసీ కెమెరాలను అనుసంధానం చేయడం ద్వారా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎక్కడ ఏం జరుగుతుందో తెలుసుకునే అవకాశం ఏర్పడింది. ఈ సౌకర్యంతో పారదర్శకంగా రిజిస్ట్రేషన్ అయ్యే అవకాశం ఉంది.

ప్రతి ఒక్కరు స్లాట్‌బుకింగ్ చేసుకోవాలి..

- ఆర్.వి.వి.స్వామి, సబ్ రిజిస్ట్రార్, సిరిసిల్ల



ప్రతి ఒక్కరు దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికే రిజిస్ట్రేషన్ అయ్యే అవకాశం ఉంటుంది. రిజిస్ట్రేషన్‌లపై త్రినేత్రం అమలవుతుంది. నిఘా కెమెరాల్లో బంధించబడుతుంది. స్లాట్ బుకింగ్ ఇంటి వద్ద అయినా లేదా మీ సేవలో నైనా, దస్తావేజు లేఖరుల వద్ద చేసుకోవచ్చు. ఎలాంటి లోపాలు లేకుండా పారదర్శకంగా రిజిస్ట్రే షన్ ప్రక్రియను పూర్తి చేస్తున్నాం.

సమస్యల పరిష్కారంపై మంత్రి సానుకూల స్పందన



మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన నాయకులు

సిరిసిల్ల టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారంపై ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారు. ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబును సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చెందిన వివిధ సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలను మంత్రికి వివరించారు. పవర్‌లూం పరిశ్రమపై కరెంటు సమస్య, బ్యాంక్ బిల్లింగ్‌ల వంటి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి శ్రీధర్‌బాబు సమస్యలపై సానుకూలంగా స్పందించారు. ఆర్థిక మంత్రితో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని హామీనివ్వడంపై వస్త్ర పరిశ్రమ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రిని కలసిన వారిలో సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, ప్రధానకార్యదర్శి గౌడ రాజు, ఉపాధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, ప్రధాన కార్యదర్శి అంకాలపు రవి, నాయకులు బూట్ల నవీన్, బూట్ల సతీష్, బండారి అశోక్ ఉన్నారు.

ఘనంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం..



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న డీవైఎస్‌వో రాందాసు

సిరిసిల్ల టౌన్, జూన్1 (ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సిరిసిల్ల పట్టణంలో ఘనంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా స్థానిక మినీ స్టేడియం వద్ద సైకిల్ ర్యాలీని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాసు ప్రారంభించారు. మినీస్టేడియం నుంచి రాజీవ్‌నగర్ బైపాస్ రోడ్డుమీదుగా తిరిగి ఖేల్ ఇండియా సెంటర్(మినీ స్టేడియం)వరకు సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. బాలబాలికలతో కలిసి జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాసు సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట కళాశాలలు, పాఠశాలలకు చెందిన బాలబాలికలు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, అథ్లెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నేటి 'ప్రజావాణి' రద్దు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల నేపథ్యంలో ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలి



విద్యార్థులను ఆహ్వానిస్తున్న మండల విద్యాధికారి

ఇల్లంతకుంట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసుతులు ఉన్నందున పిల్లలను చేర్పించాలని మండల విద్యాధికారి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. మండల కేంద్రంలో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పుస్తకాలు, భోజనం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో బలోపేతం చేయవలసిన అవసరం ఉందన్నారు. ప్రాథమిక పాఠశాలల పరిరక్షణకు ఎస్టీయూ ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ బడిని బలోపేతం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కర్నెద మహిపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బారోజు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి గోన సత్యం, విజేందర్‌రెడ్డి, కిషన్, సాగర్, సురేందర్, అరవింద్, శ్రీకాంత్, వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాలి

చందుర్తి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు కనీస వేతనాల చట్టాన్ని అమలుచేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు అన్నారు. చందుర్తి మండలకేంద్రంలో ఆదివారం జరిగిన సీపీఐ మహాసభ నాయకులు మీసం లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా రాములు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు అవుతుందన్నారు. ఈ ప్రాంతంలో సీపీఐ ఎమ్మెల్యేగా రాజేశ్వరరావు ఉన్న సమయంలో ఎంతో మంది పేదవాళ్లకు భూములు పంపిణీ చేశారన్నారు. ఆనాడు తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన బద్దం ఎల్లారెడ్డి, రాగి నారాయణ రెడ్డి, గడ్డం తిరుపతిరెడ్డిలాంటి ఎంతో మంది అమరులయ్యారన్నారు. సీపీఐ కార్మికుల, రైతుల, కూలీల పక్షాన పోరాడుతూనే ఉందన్నారు. అమరుల త్యాగాల ద్వారానే తెలంగాణ ఏర్పడిందన్నారు. బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా వేల కోట్ల రూపాయలు బ్యాంకు రుణాలు మాఫీ చేసిన మోదీని ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయన్నారు. కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కులేకుండా, పని భద్రత కల్పించకుండా బడా పెట్టుబడిదారులకు కేంద్ర ప్రభుత్వం కొమ్ము కాస్తోందన్నారు. ఈనెల 14న సిరిసిల్లలో జరగబోయే సీపీఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలన్నారు. మండలంలో ఉన్న కార్మికులంతా పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. రైతులు కూలీలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మర్రి విజయ, నాయకులు బండపల్లి లక్ష్మణ్, ఇందిరా, కొమరవ్వ, లావణ్య, రాజవ్వగడ్డం మల్లవ్వ, లలిత, బొడ్డు నర్సయ్య, మల్లేశం, రాజేశ్వరి, పద్మ, మల్లవ్వ, రేణుక, రాజవ్వ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్, పదిర, రాగట్లపల్లి, హరిదాస్‌నగర్ గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మాణిక్యం, రాజవ్వ, పరుశరాములు కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి ఆదివారం పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, సుభాష్ ఉన్నారు.

గాయపడిన నాయకుడికి పరామర్శ

తంగళ్లపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పోలీసుల లాఠీచార్జిలో గాయపడ్డ తంగళ్ళపల్లి మండలం రామన్నపల్లి గ్రామానికి చెందిన చంటి యాదవ్‌ను బీఆర్ఎస్ నాయకుడు బొల్లి రామ్మోహన్ తదితరులు పరామర్శించారు. వారం రోజుల క్రితం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కార్యాలయం ముందు జరిగిన లాఠీచార్జిలో చంటియాదవ్ చేతికి తీవ్ర గాయమైంది. చంటిని పరామర్శించి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీనిచ్చారు. బండి దేవేందర్ యాదవ్, మోతే మహేష్, బండి జగన్, బొడ్డు శ్రీధర్, అరవింద్ ఉన్నారు.

ఆయిల్‌పామ్ తోట దగ్ధం



కొసునూర్‌పల్లె గ్రామంలో దగ్ధమవుతున్న ఆయిల్ పామ్ తోట

ధర్మపురి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని కొసునూర్‌పల్లె మాజీ సర్పంచ్ ఎన్నం లక్ష్మారెడ్డికి చెందిన ఆయిల్ పామ్‌తోట విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఆదివారం దగ్ధం అయ్యింది. రెండున్నర ఏళ్ల క్రితం మూడు ఎకరాల్లో లక్ష్మారెడ్డి ఆయిల్ పామ్‌తోట పెంపకం చేపట్టారు. మధ్యాహ్నం వీచిన గాలుల వల్ల విద్యుత్ వైర్లలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు లేచి ఆయిల్ పామ్ తోటలో చెట్లు కాలిపోయాయి. పైపు లైన్ కాలిపోవడంవల్ల భారీనష్టం వాటిల్లింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు, మాజీసర్పంచ్ ఎన్నం లక్ష్మారెడ్డి కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): చేగుర్తి గ్రామశివారులో ఆదివారం అక్రమంగా ఇసుకతరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ యజమాని పత్తి అజయ్ పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. మరోసారి ఇదే నేరానికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సెలవుల్లో కంప్యూటర్ శిక్షణ

● సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు ● ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు

గణేశ్‌నగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విద్యార్థులు తమకు ఇష్టమైన రంగంలో శిక్షణ తీసుకుంటారు. క్రీడలు, స్విమ్మింగ్, కరాటే, స్పోకెన్ ఇంగ్లీష్ వంటివి నేర్చుకుంటారు. మరికొందరు సంగీతం, వివిధ రకాల కళలను నేర్చుకుంటారు. ప్రస్తుత పోటీ



ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు వేసవి సెలవుల్లో కంప్యూటర్ శిక్షణ ఇప్పిస్తున్నారు. దీంతో పట్టణాల్లో కంప్యూటర్ సెంటర్లు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. మరోవైపు యువత ఉద్యోగానికి అవసరమైన శిక్షణ తీసుకుంటున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల యువత, విద్యార్థులు వేసవి సెలవుల్లో ప్రతిరోజు జిల్లా కేంద్రంలోని కంప్యూటర్ సెంటర్లలో శిక్షణ పొందుతున్నారు. కొందరు ఉపాధి కోసం మరికొందరు ఉన్నత చదువుల కోసం శిక్షణ తీసుకుంటున్నారు.

● డిమాండ్ ఉన్న కోర్సులు

కంప్యూటర్ కోర్సులో ఎంఎస్ ఆఫీస్ ప్రతి ఒక్కరూ నేర్చుకునేందుకు ఎక్కువగా ఇష్టపడతారు. ఫొటోషాప్, డీటీపీ, టాలీ, ఆటో కాడ్ వంటి కోర్సులు నేర్చుకుంటున్నారు. వీటి తర్వాత పీజీడీసీఏ ఆరు నెలల కోర్సు కావడంతో అవసరం ఉన్నవారు మాత్రమే దానిని ఎంచుకుంటారు. శిక్షణ పొందిన వారు కొందరు ఇంటర్‌నెట్ సెంటర్లలో, కళాశాలలు, ఆస్పత్రుల్లో కంపూటర్ ఆపరేటర్లుగా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు నెల రోజులు పాటు ఇచ్చే శిక్షణకు రూ.2000 వరకు తీసు కుంటున్నారు. శిక్షణ అనంతరం పరీక్ష నిర్వ హించి కేంద్ర ప్రభుత్వం అనుమతి పొందిన ఐఎస్‌ఓ సర్టిఫికెట్ అందజేస్తున్నారు.



కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి
– శ్రీధర్, ఓంకార్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు



ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏ రంగంలోనైనా కంప్యూటర్ అనుసంధానంగానే పనులు జరుగుతున్నాయి. గతంలో అవసరం ఉంటేనే కంప్యూటర్ నేర్చుకునేవారు.. కానీ నేడు కంప్యూటర్ నేర్చుకొని ఉండటం తప్పనిసరి. శిక్షణ అనంతరం కొంత మందికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తున్నాం. మా వద్ద శిక్షణ తీసుకున్న వారు కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తక్కువ ఫీజు
– బంధారపు అజయ్, స్పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, చొప్పదండి



గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు అతి తక్కువ ఫీజుతో కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నాం. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు బీటెక్‌లో ఉండే సిలబస్‌ను ముందుగానే వేసవి సెలవుల్లో అవగాహన కల్పిస్తున్నాం. టెన్త్, ఇంటర్ డిగ్రీ విద్యార్థులకు కంప్యూటర్ విద్య తప్పనిసరిగా అవసరం. ఏం చదువుకున్నా ఉద్యోగ సమయంలో కంప్యూటర్ చాలా ఉపయోగపడుతుంది.

ఉపాధి పొందేందుకు శిక్షణ
– అబ్రార్, విద్యార్థి



వేసవి సెలవులను వృథా చేయకుండా ప్రస్తుతం నగరంలోని ఓంకార్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్‌లో టాలీ నేర్చుకుంటున్నా. టాలీపై పట్టు సాధించి ప్రభుత్వ ప్రైవేట్ ఏదైనా ఉద్యోగంలో చేరాలనేది నా కోరిక. ఇక్కడ సులభంగా అర్థమయ్యే విధంగా నేర్పిస్తున్నారు.

భవిష్యత్ కోసం
– ఎస్ హిరణ్య, విద్యార్థిని



నేను ఇంటర్ పూర్తిచేశాను. చొప్పదండిలోని స్పేస్ కంప్యూటర్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్నాను. ఉన్నత చదువుల కోసం, భవిష్యత్ ఉద్యోగ ప్రయత్నాల్లో ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఎంఎస్ ఆఫీస్ నేర్చుకుంటున్నా.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

రామగిరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్‌లో పేకాట ఆడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు ఆదివారం సిబ్బందితో బేగంపేట్‌లో దాడులు నిర్వహించగా పేకాట ఆడుతూ ముగ్గురు వ్యక్తులు పట్టుపడ్డారన్నారు. వారివద్ద నుంచి 2,310 రూపాయలు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వన్ టౌన్ ఎదుట ఉన్న ఒక లాడ్జి సమీపంలో ఆదివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. చనిపోయిన వ్యక్తికి సుమారు 55 ఏళ్ల ఉంటాయని, ప్రభుత్వాస్పత్రిలోని మార్చ్యూరిలో భద్ర పరిచామని పేర్కొన్నారు. మృతుడిని గుర్తించినవారు ఒకటో టౌన్ పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

మల్లాపూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండలంలోని ఒడ్డెరకాలనీకి చెందిన దండుగుల శ్రీనివాస్(22) అనే యువకుడు ఆదివారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై లక్ష్మణ్ తెలిపారు. శ్రీనివాస్ రెండేండ్ల క్రితం హైదరాబాద్‌లో లాండ్రి సెంటర్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. తల్లికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో మల్లాపూర్‌లోనే ఉంటున్న శ్రీనివాస్ జీవితంపై విరక్తి చెందాడు. ఆదివారం ఉదయం గ్రామశివారులోని చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణం పొందాడు. అటువైపు వెళ్తున్న స్థానికులు గమనించి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. శ్రీనివాస్ చిన్నతాత శివరాత్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి బలవన్మరణం


రామడుగు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో జీవితం మీద విరక్తి చెందిన వృద్ధురాలు బావిలోదూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని దేశరాజుపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దేశరాజుపల్లి గ్రామానికి చెందిన ఈరుమల్ల బాలమ్మ(74) కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. వైద్యులు ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఆపరేషన్‌కు భయపడిన ఆమె శనివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త ఈరుమల్ల కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ముస్తాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడూర్ స్టేజి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలకేంద్రానికి చెందిన కూర సిద్ధిరాములు(53) మృతిచెందాడు. సిద్ధిరాములు తన ద్విచక్రవాహనంపై ముస్తాబాద్‌కు వస్తుండగా గూడూర్ స్టేజి వద్ద ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ గణేష్ పరిశీలించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని ఢీకొట్టిన కారు

● అక్కడికక్కడే మృతి



కొమురయ్య(ఫైల్)

సుల్తానాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుకులలో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న తాళ్లపల్లి కొమురయ్య (85) అనే వృద్ధుడిని ఆదివారం కారు ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కొమురయ్య అల్లుడు ఇల్లెందుల శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాముని‌పల్లికి చెందిన తాళ్లపల్లి కొమురయ్య ప్రతీరోజు మధ్యాహ్నం, రాత్రి పూటభోజనం కోసం కనుకులలోని కూతురు ఇంటికి నడుచుకుంటూ వచ్చివెళ్తుండేవాడు. ఆదివారం మధ్యాహ్నం కూడా అలాగే నడుచుకుంటూ వస్తుండగా వెనక వైపు నుంచి కారు కొమురయ్యను ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలతో వృద్ధుడు అక్కడికక్కడే చనిపోయారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుబాయిలో ముత్యంపేట వాసి ఆత్మహత్య

● స్వగ్రామం చేరిన మృతదేహం



శ్రీనివాస్(ఫైల్)

మల్యాల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం ముత్యంపేట కొండగట్టుకు చెందిన పంజాల శ్రీనివాస్‌గౌడ్(54) అనే వ్యక్తి ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి మూడు నెలలక్రితం ఆత్మహత్య చేసుకోగా ఆదివారం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. శ్రీనివాస్‌గౌడ్ రెండేళ్ల క్రితం దుబాయి వెళ్లాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 21న ఆత్మహత్య చేసుకోవడంతో అక్కడి పోలీసులు మార్చురీలో భద్రపరిచారు. కంపెనీ వీసా కాకపోవడంతో మూడు నెలల గడిచినా ఆచూకీ లభించకపోగా ఫింగర్‌ప్రింట్స్ ఆధారంగా పది రోజుల క్రితం కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి అధ్యక్షుడు నర్సింహ దృష్టికి కూడా వెళ్లడంతో ఉపాధ్యక్షుడు శేఖర్‌గౌడ్ ద్వారా వివరాలు సేకరించారు. దుబాయిలో గల ప్రభాకర్ తదితరుల చొరవతో శ్రీనివాస్‌గౌడ్ మృతదేహం ఆదివారం స్వగ్రామం చేరుకుంది.

అడవిలో కలప దొంగలు

● యథేచ్ఛగా టేకు చెట్లు నరికివేత
● ఓబులాపూర్ అటవీ ప్రాంతంలో నిత్యకృత్యంగా కలప తరలింపు
● అధికారుల పర్యవేక్షణ కరువు



నరికివేయగా మిగిలిన చెట్టు మొదలు



నరివేయడంతో బోసిగా కనిపిస్తున్న టేకు చెట్ల మొదలు

మల్యాల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గతంలో రాష్ట్ర స్థాయిలో పేరొందిన ఓబులాపూర్ అటవీ ప్రాంతంలో ప్రస్తుతం కలపదొంగలు పెట్రేగిపోతున్నారు. యథేచ్ఛగా టేకుచెట్లను నరికివేస్తూ అక్రమంగా తరలిస్తున్నారని సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓగులాపూర్ గ్రామం అటవీ ప్రాంతం పచ్చని గుట్టల మధ్య ఉండగా ఇక్కడ దాదాపు 4,619 ఎకరాల పరిధిలో అటవీవిస్తీర్ణం ఉంది. సుమారు ఇరవై ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం వనసంరక్షణ సమితిలను ఏర్పాటు చేయగా ఇక్కడ కూడా గ్రామస్థులు సమష్టిగా వనం పెంపుకు కృషి చేశారు. ముఖ్యంగా టేకు వనం పెంచడంతో ఈప్రాంతంలో అటవీవిస్తీర్ణం పెరిగింది. అయితే కొన్నాళ్లుగా విచక్షణ రహితంగా ఇక్కడ టేకు వనాలను నరికి వేస్తున్నారు.

● ప్రతి నిత్యం అక్రమంగా తరలింపు

ఓబులాపూర్ అటవీప్రాంతం వేలాదిఎకరాల్లో పరచుకొని ఉండడంతో ఓబులాపూర్‌తో పాటు గొర్రెగుండం, ఒడ్యాడు తదితర ప్రాంతాల శివార్ల వరకు టేకు వనం ఉంది. అయితే కొందరు కలప దొంగలు నిత్యం టేకు కలపను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పలువురు పేర్కొంటున్నారు. సంబంధిత అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, మొక్కుబడి పర్యవేక్షణలతో కలప తరలుతోందని ఓబులాపూర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఒడ్యాడు మార్గంలో కొన్నాళ్ల క్రితం వంట చెరుకు పేరిట నరికివేసి తరలించడానికి సిద్ధంగా ఉంచిన కలపను పట్టుకొని నామమాత్రపు జరిమానాలు విధించారనే చర్చ జరిగింది. అటవీ ఉన్నతాధికారులు దృష్టిసారించి చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని, నిత్యం గస్తీకోసం చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. ఈ విషయమై ఫారెస్ట్ బీట్ అధికారి వసీంను వివరణ కోరగా.. టేకు కలప నరికివేత ప్రదేశాలను గుర్తించి మరోసారి అలా జరుగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. టేకు కలప నరికిన వారిపై పలుమార్లు జరిమానాలు కూడా విధించడం జరిగిందని, టేకు కలప సంరక్షణకు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



జయ్యారంలో బోనాలతో మహిళలు

పాలకుర్తి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా మండలంలోని జయ్యారం గ్రామంలో గ్రామ దేవత పోచమ్మకు ఘనంగా బోనమెత్తారు. ఆదివారం గౌడ సామాజిక మహిళలు ప్రతీఇంటి నుంచి బోనం తయారుచేసుకొని డప్పు చప్పుళ్లతో ఆలయానికి తరలి వెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు.

భక్తులతో కిక్కిరిసిన మల్లన్న క్షేత్రం



మల్లన్న ఆలయంలో పట్నాలు వేస్తున్న భక్తులు

ఓదెల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం వేలాది మంది భక్తులతో కిక్కిరిసింది. రోహిణి కార్తె ప్రవేశంతో వ్యవసాయ పనులకు సిద్ధమయ్యే ముందు రైతన్నల కుటుంబాలు వేలాదిగా తరలివచ్చి మొక్కులను సమర్పించారు. అలాగే కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, మంచిర్యాల, వరంగల్, సిద్దిపేట తదితర జిల్లాల నుంచి వాహనాల్లో దాదాపు 20 వేల పైచిలుకు మంది భక్తులు జాతరకు తరలివచ్చి మల్లికార్జున స్వామి, మధన పోచమ్మ, బంగారు పోచమ్మలను దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయంలో కోడెలతో ప్రదక్షిణలు నిర్వహించారు. భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి, బోనాలతో మల్లన్నకు సమర్పించారు. క్యూ లైన్‌లో భక్తులు మూడు గంటల సమయం వరకు వేచి ఉండి మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి భక్తుల సంఖ్య అధికంగా పెరగడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. దీంతో భక్తులు బోనాలు సిద్ధం చేసేందుకు, సేదతీరేందుకు సరైన స్థల విస్తీర్ణం లేక భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఈయేడూ ఇక్కట్లేనా?

● రూ. 1.30 కోట్లు మంజూరైనా ప్రారంభం కాని రోడ్డు పనులు ● వెయ్యి మంది విద్యార్థులకు కష్టాలు



వర్షాకాలంలో నీటిలో నడుచుకుంటూ వెళుతున్న విద్యార్థులు(ఫైల్)

కథలాపూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మోడల్‌స్కూల్, ప్రభుత్వజూనియర్ కళాశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలకు వెళ్లేందుకు ఉన్నది ఒకేఒక రోడ్డు. వర్షాలు కురిశాయంటే ఈ పాఠశాలల్లో చదివే సుమారు వెయ్యిమంది విద్యార్థుల బాధలు వర్ణనాతీతంగా ఉంటాయి. మోకాలి లోతు నీటిలో కళాశాల, పాఠశాలలకు వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి. పదేళ్లుగా ఎమ్మెల్యేలు, ఎంపీలకు అధ్యాపకులు, విద్యార్థులు అనేక వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకున్న పాపాన పోలేదు. రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతులు చేసినా వానలకు కొట్టుకుపోవడం సర్వసాధారణంగా మారింది. అయితే వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎంఆర్‌ఆర్ గ్రాంట్ కింద రోడ్డు నిర్మాణానికి రూ. 1.30 కోట్లు మంజూరుచేయించారు. నాలుగు మాసాల క్రితం శంఖుస్థాపన కూడా చేశారు. ఈ పనులు చేపట్టడానికి ఓ కాంట్రాక్టర్ ముందుకు వచ్చి అగ్రిమెంట్ చేసుకున్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పలుమార్లు రోడ్డును పరిశీలించినా పనులు ప్రారంభించడంలో విపరీత జాప్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామం పైభాగం నుంచి వచ్చే మురికినీటిని కూడా మళ్లించడానికి మురికి కాలువ కూడా ఇదే ప్యాకేజీలో తీసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి కస్తూర్బాగాంధీ పాఠశాల మీదుగా జూనియర్ కాలేజీ దాకా నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈ కాలువ నిర్మాణం కోసం లెవెల్‌తీసి వదిలేశారు. ఈ క్రమంలో వర్షాలు కురుస్తున్నందువల్ల పనులకు ఆటంకం కలిగే పరిస్థితి నెలకొంది. వేసవి కాలంలోనే రోడ్డు, కల్వర్టుల నిర్మాణాలు పూర్తి చేయడంలో జాప్యం చేశారనే విమర్శలు వస్తున్నాయి.

కాంట్రాక్టర్ కంకర, ఇసుక, స్టీల్ వంటి సామగ్రి పనిప్రదేశంలో సిద్ధంగా ఉంచుకున్నప్పటికీ అధికారులు పనుల కొనసాగింపులో ఎందుకు తాత్సారం చేస్తున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈ ఏడాది కూడా తమకు నీటి కష్టాలు తప్పవని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

వ్యవసాయ బావిలో పడి ఒకరి గల్లంతు



పోచయ్య(ఫైల్)

ఎలిగేడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్‌గ్రామానికి చెందిన కాంపల్లి పోచయ్య(67)అనేవ్యక్తి వ్యవసాయబావిలో మునిగి ఆదివారం గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపినవివరాల మేరకు.. మధ్యాహ్న సమయంలో పోచయ్య తన మనుమడికి ఈత నేర్పేందుకు పొలిమేరల్లో ఉన్న వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. మనుమడిని బావి మీదనే ఉంచి పోచయ్య బావిలో దిగి ఈత కొడుతూ ఊపిరాడక కొన్ని నిమిషాల్లోనే నీటిలో మునిగిపోయాడు. పోచయ్య కని పించకపోవడంతో బావిపై ఉన్న మను మడు ఇతరులు కేకలు వేయడంతో అంద రు బావివద్దకు వచ్చారు. విషయాన్ని జూల పల్లి పోలీసులకు తెలపడంతో గల్లంతైన పోచయ్యను బయటకు తీసేందుకు విద్యుత్ మోటార్లు పెట్టి నీటిని తోడుతున్నారు.

8 వరకే శుభముహూర్తాలు

- జూన్ 9 నుంచి జూలై 25 వరకు ముహూర్తాలు లేవు
- తిరిగి ఆగస్టు వరకు ఆగాల్సిందే



కరీంనగర్ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వివాహాది శుభకార్యాల నిర్వహణకు శుభముహూర్తాల కరువు ఏర్పడనుంది. ఈ నెలలో 8వ తేదీ వరకు మాత్రమే ముహూర్తాలు ఉన్నాయి. ఈ స్వల్ప వ్యవధిలోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది సంఖ్యలో శుభకార్యాలు జరుగనున్నాయి. దీంతో పెళ్లి మండపాలు, పురోహితులు, బాజాభజంత్రీలు, ఈవెంట్స్ నిర్వాహకులు, వంటవారు, పూలు, అలంకరణలు, బట్టలు, బంగారం, కిరాణం వంటి వివిధ షాపుల వారికి గిరాకీ పెరగనుంది. ఆయా రంగాలకు చెందిన వ్యక్తులకు అడ్వాన్స్‌లు కూడా ముట్టాయి. అనంతరం ముహూర్తాల కోసం ఆగస్టు వరకు ఆగాల్సిందే 9వ తేదీ నుంచి గురు మౌఢ్యంతో పాటు జ్యేష్ఠ మాసం కావడంతో జూన్‌లో, ఆ తర్వాత జూన్ 26 నుంచి జూలై 24వ తేదీ వరకు ఆషాఢమాసం కారణంగా ముహూర్తాలు లేవు. జూలై 27వ తేదీ నుంచి ఆగస్టు 14వ తేదీ వరకు శ్రావణమాసంలో తిరిగి 29 రోజుల పాటు ముహూర్తాలున్నాయి. ఆగస్టు 24వ తేదీ నుంచి భాద్రపదమాసం, సెప్టెంబరు 22వ తేదీ నుంచి ఆశ్వయుజమాసం కారణంగా అక్టోబరు 21వ తేదీ వరకు ముహూర్తాలు లేవు. అక్టోబరు 24 నుంచి తిరిగి ముహూర్తాలు ఉన్నాయి.

ఫుల్ క్రేజీ.. బాస్కెట్ బాల్





- జిల్లాలో ఆదరణ ఉన్న ఆట
- శిక్షణ శిబిరాలకు పెద్ద సంఖ్యలో హాజరవుతున్న చిన్నారులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ క్రీడకు జిల్లాలో మంచి ఆదరణ ఉంది. ఏటా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరాలకు చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. 2017, 2018లో జరిగిన శిబిరంలో 100 లోపు, 2019లో సుమారు 300 మంది, ప్రస్తుతం 200 మందికి పైగా చిన్నారులు శిక్షణ పొందుతున్నారు.

● ఆడే విధానం...

ప్రతి టీంలో 12 మంది క్రీడాకారులు ఉంటారు. వీరిలో ఏడుగురు సబ్‌స్టిట్యూట్‌లుగా ఉండగా, ఐదుగురు ఆట ఆడతారు. రెఫరీ ఆటను ప్రారంభించే ముందు రెండు టీంల మధ్య జంప్‌బాల్ ఎగురవేసి ఆటను ప్రారంభిస్తారు. లైన్ బయటి నుంచి గోల్ చేస్తే మూడు పాయింట్లు ఇస్తారు. రెండు పాయింట్ల జోన్ నుంచి వేస్తే రెండు పాయింట్లు ఇస్తారు. ఫ్రీ త్రో నుంచి వేస్తే ఒక్క పాయింట్ ఇస్తారు. ఇలా ఏ జట్టు ఎక్కువగా స్కోర్ సాధిస్తే దానిని విజేతగా నిర్ణయిస్తారు.



బాస్కెట్‌బాల్ ఆడుతున్న బాలికలు

శిక్షణ బాగుంది..

- సాత్విక



గతంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపులో స్విమ్మింగ్‌లో శిక్షణ తీసుకున్నా. ఇప్పుడు బాస్కెట్‌బాల్‌లో ట్రైనింగ్ తీసుకుంటున్నా. కోచ్‌లు బాగా శిక్షణ ఇస్తున్నారు.

జాతీయ స్థాయిలో ఆడాలని ఉంది..

- విఖ్యాత్



బాస్కెట్‌బాల్ గేమ్ అంటే చాలా ఇష్టం. స్కూల్‌లో కూడా ప్రాక్టీస్ చేస్తా. సమ్మర్ క్యాంపు ప్రారంభం నుంచి వస్తున్నా. గేమ్‌లో టెక్నిక్‌లు అన్ని నేర్చుకుని రాష్ట్ర, జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనాలనేది లక్ష్యం.

గత సంవత్సరం నుంచి వస్తున్నా..

- స్వప్నిక



ప్రస్తుతం బాస్కెట్‌బాల్‌ను ఆడేందుకు చాలా మంది ఇష్టపడుతున్నారు. నేను గత సంవత్సరం పెట్టిన సమ్మర్ క్యాంపునకు కూడా వచ్చాను. మంచిగా ప్రాక్టీస్ చేసి బాస్కెట్‌బాల్‌గా చాంపియన్‌గా ఎదగాలని ఉంది.

వాటర్ ట్యాంక్ ఎక్కి యువకుడి ఆత్మహత్యాయత్నం

- కానిస్టేబుల్ కౌన్సెలింగ్‌తో కిందికి దిగిన యువకుడు

కరీంనగర్ క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం బావుపేటకు చెందిన పేరెళ్ల సన్ని అలియాస్ దయాసాగర్ ఆదివారం కుటుంబసభ్యులతో గొడవపడి వాటర్‌ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యకు యత్నించగా కానిస్టేబుల్ కౌన్సెలింగ్‌తో కిందికి దిగివచ్చాడు. పోలీసుల వివరాల ప్రకారం.. దయాసాగర్ ఆదివారం ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడి దాడికి దిగాడు. అనంతరం గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. డయల్ 100 ద్వారా కొత్తపల్లి పోలీసులకు విషయం తెలియగానే కానిస్టేబుల్ విజయరావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. దయాసాగర్‌తో మాట్లాడుతూ కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో యువకుడు కిందకు దిగి వచ్చాడు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ విజయరావును కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్, కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి అభినందించారు.

సువిశాలమైన గోశాల నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సూచించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామికి ఎంతో ప్రీతికరమైన కోడెల సంరక్షణ కోసం అత్యాధునిక వసతులతో, సువిశాలమైన నూతన గోశాల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించినట్లు ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల ఖతర్ పర్యటన ముగించుకొని రాష్ట్రానికి తిరిగి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వేములవాడ అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఇటీవల రూ.200కోట్లతో వేములవాడ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేయడంపై, ఇటీవల ఏఐసీసీ ప్రకటించిన కమిటీల్లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ, డీలిమిటేషన్ కమిటీ సభ్యులుగా నియమించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఖతర్ పర్యటన వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. రాజన్న ఆలయంలో జరగబోవు అభివృద్ధి, గోశాలలో జరుగుతున్న పలు అంశాలపై ముఖ్యమంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారనారు. గోశాలలోని కోడెలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అత్యాధునిక వసతులతో సువిశాలమైన స్థలంలో నూతన గోశాల నిర్మాణం కోసం స్థలసేకరణ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారని, కోడెలు మృతిచెందడం బాధాకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, కోడెలు అనారోగ్య బారినపడకుండా ప్రభుత్వం, ఆలయం తరపున జాగ్రత్తల తీసుకుంటామని వివరించారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నిరుపేద విద్యార్థులకు అండగా కపిల్ 'విద్యావారధి'

- పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల పైచదువులకు సహకారం

భగత్‌నగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు సంక్షేమ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో సువర్ణ అవకాశం కల్పిస్తున్నట్లు ట్రస్ట్ ఉపాధ్యక్షుడు అప్పిడి రాజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులులేని, నిరుపేద, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన, 470పై మార్కులు సాధించిన విద్యార్థులకు వారు స్థిరపడే వరకు ఏ కోర్సు చేసినా ఆయ్యే ఖర్చులను కపిల్ విద్యావారధి భరిస్తుందన్నారు. ఇందుకు ఈనెల8న అర్హతపరీక్ష ఉంటుందన్నారు. ఉమ్మడి కరీంనగర్‌జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ట్రస్ట్‌ఈఅవకాశాన్ని కల్పిస్తుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు కపిల్ విద్యావారధి ఆర్గనైజేషన్‌ద్వారా ఆన్‌లైన్‌లో జూన్5వతేదీవరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్8న కరీంనగర్‌లో అర్హతపరీక్ష ఉంటుంద న్నారు. ఈ అవకాశాన్ని పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఫిజికల్ డైరెక్టర్ మృతి



కడారి రవి(ఫైల్)

కరీంనగర్ స్పోర్ట్స్/పెద్దపల్లి కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ కడారి రవి(57) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. హైదరాబాద్‌కు తనకారులో వెళ్తుండగా సిద్దిపేట జిల్లా కొమురవెల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో కారుటైరు పగిలి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న రవికి తీవ్రగాయాలయ్యాయి.వెంటనే సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. కడారి రవి ప్రస్తుతం పెద్దపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా, వ్యాయామ విద్య ఉపాధ్యా య రీసోర్స్ పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఉమ్మడి జిల్లా అథ్లెటిక్ క్రీడాకా రుడిగా జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయి పోటీల్లో రాణించారు.

● పూర్వ విద్యార్థుల సమ్మేళనం సంతాప సభగా...

దోమలగూడలోని ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల (1991) పూర్వ విద్యార్థుల సమ్మేళనం, జింఖానా గ్రౌండ్స్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్ పోటీలకు వెళ్లేందుకు ఆదివారం ఉదయం కరీంనగర్ నుంచి బయల్దేరిన రవి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం రవి సంతాప సభగా మారింది.

● పలువురి సంతాపం

కడారి రవి మృతితో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు క్రీడారంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల డీవైఎస్‌వోలు శ్రీనివాస్‌గౌడ్, సురేష్, రాందాస్, రవి, ఉమ్మడి జిల్లా ఒలంపిక్‌సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు తుమ్మల రమేశ్ రెడ్డి, మహ్మద్ కరీం, నాగిరెడ్డి సిద్ధారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లిజిల్లాల పీఈటీల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు అంతటి శంకరయ్య,శ్రీనివాస్, బాబుశ్రీనివాస్,ఆడెపు శ్రీనివాస్, వేల్పుల సురేందర్, దాసరి రమేశ్ తదితరులు సంతాపం తెలిపారు.

● పెద్దపల్లి డీఈవో మాధవి, మండల విద్యాధికారి సురేందర్, ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేందర్ కరీంనగర్‌లోనివాళులర్పించారు.

భక్తజన సంద్రంగా మారిన రాజన్న ఆలయం

- 70 వేలకు పైగా రాజన్నను దర్శించుకున్న భక్తులు..
- రాజన్న దర్శనానికి నాలుగు గంటల సమయం..



రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్త జనసంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజన్న ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మ దర్శనం, కోడె మొక్కు క్యూలైలో భక్తులు సుమారు నాలుగు గంటలకు ఆలయంలోకి చేరుకొని శ్రీపార్వతి రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు ఇష్టమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనుబంధాలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామిని 70 వేల మంది వరకు భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అత్యాధునిక గోశాలల ఏర్పాటు హర్షణీయం

కరీంనగర్ అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యాధునిక సౌకర్యాలతో 50ఎకరాల విస్తీర్ణంలో గోశాలలను ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై కరీంనగర్ జీవకారుణ్య సమితి ఉమ్మడి జిల్లా కార్యదర్శి, న్యాయవాది డాక్టర్ జి కొమురయ్య హర్షం వ్యక్తం చేశారు. జీవకారుణ్య సమితి తరపున సీఎంకు అభినందనలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతిజిల్లాలో అత్యాధునిక సౌకర్యాలతో 50ఎకరాలలో గోశాలలను ఏర్పాటు చేసి గోవుల ద్వారా సమకూరే పేడ, గోమూత్రం రైతులకు అందించి సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కొమురయ్య కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాల విక్రయం

హుజూరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు గోస్కుల అజయ్ అన్నారు. ఆదివారం హుజూరా బాద్‌లో ఆయన మాట్లాడుతూ హుజూరాబాద్‌లోని పలుప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, నోట్‌పుస్తకాలు, టై, బెల్ట్‌లు అమ్ముతున్నారన్నారు. పుస్తకాల విక్రయం ఆపకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ సమస్యపై విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలను సీజ్ చేయాలన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశమైన విశ్రాంత ఉద్యోగులు

భగత్‌నగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని బీజేపీ విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగ, రాష్ట్ర సెల్ కో-చైర్మన్ నరహరి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో నిర్వహించిన విశ్రాంతఉద్యోగుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లాగానే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పీఆర్సీ, డీఏలు ఇవ్వడం లేదని, రిటైర్‌మెంట్ అయిన వారికి పెన్షన్, జీపీఎఫ్ డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదంటూ న్యాయమైన సమస్యలను పరిష్కరించక పోవడం శోచనీయమన్నారు. ఉద్యోగులు ప్రభుత్వాన్ని కొత్త కోరికలు కోరడం లేదని, భేషజాలకు పోకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా సెల్ నాయకులు గంట్ల నర్సింహారెడ్డి, కర్ర ప్రభాకర్‌రెడ్డి, గోలి సత్యనారాయణరెడ్డి, పింగిలి ప్రతాపరెడ్డి, అబ్బిడి మాధవ రెడ్డి, ఈరెడ్డి తిరుమలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న కోడెల సంరక్షణకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- పశు వైద్యాధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు, చికిత్సలు
- జీవాలకు మెరుగైన దాణా, పచ్చిగడ్డి ఇచ్చేలా ప్రణాళిక
- 32 మందికి రెండు చొప్పున 64 కోడెల పంపిణీ



కోడెలను అందిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అధికారులు

వేములవాడ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి కోడెల సంరక్షణకు పకడ్బందీగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. వేములవాడ పరిధిలోని తిప్పాపూర్‌లో ఉన్న వేములవాడ శ్రీరాజేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన గోశాలలోని 32 జతల కోడె పిల్లలను అర్హులైన రైతులకు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోశాల ఆవరణలో మొత్తం పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సలహాలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ కోడె పిల్లలను పొందిన రైతులు వాటి సంరక్షణ బాధ్యతను పక్కాగా చూడాలని సూచించారు. వాటి నిర్వహణ తదితర అంశాల్లో ఏమైనా పక్కదారి పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోశాల ఆవరణలో లోతుగా ఉన్న స్థలంలో మట్టిని పోయిస్తూ చదును చేస్తున్నామని తెలిపారు. కోడెలకు మెరుగైన దాణా, పచ్చిగడ్డి అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని వాటిని అందిస్తున్నామని వివరించారు. పశువైద్యాధికారుల బృందంతో జీవాలకు వైద్యం అందిస్తూ పర్యవేక్షిస్తున్నామని స్పష్టం చేశారు. హాజరైన ఆర్డీఓ రాధాబాయి, వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఈఓ వినోద్ రెడ్డి, తహశీల్దార్ విజయ ప్రకాష్ రావు, మున్సిపల్ కమీషనర్ అన్వేష్, తదితరులు ఉన్నారు.

● నాలుగు రాజన్న కోడెలు మృతి..

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి తిప్పాపూర్ గోశాలలో ఆదవారం ఉదయం నాలుగు కోడలు అనారోగ్యంతో మృతిచెందాయి. ఘోశాలలో అనారోగ్యంతో కొట్టుమిట్టాడుతున్న కోడెలు మృతిచెందాయి. మృతిచెందిన కోడెలను ట్రాక్టర్‌లో తరలించి మూలవాగులో ఖననం చేశారు.



కోడెలను అందుకున్న రైతులు

రాజన్న కోడెలకు వైద్య శిబిరం

- 500 పశువులకు ఎల్ఎస్‌డీ వ్యాక్సినేషన్
- అనారోగ్యం బారిన పడిన 16కోడెలకు చికిత్స
- అకాల వర్షాలు, అనారోగ్యంతో 17 కోడెల మృతి
- కోడెలు ఆరోగ్యంగా అయ్యే వరకు వైద్యం
- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి

సిరిసిల్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన తిప్పాపూర్‌లోని గోశాలలోని కోడెల రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టామని, కోడెలు పూర్తిగా ఆరోగ్యంగా అయ్యే వరకు వైద్య శిబిరం నిర్వహిస్తామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గోశాలలోని కోడెల విషయమై హెల్త్ బులిటెన్‌ను విడుదల చేశారు. అకాల వర్షాలు, అనారోగ్య పరిస్థితుల వల్ల వేములవాడ తిప్పాపూర్‌లోని గోశాలలో 8 కోడెలు మొదటగా మరణించగా, జిల్లా యంత్రాంగం అప్రమత్తమై ఐదుగురు పశువైద్య డాక్టర్లతో కూడిన 12 మంది బృందం గోశాలలోని పశువులను పరిశీలించిందన్నారు. రెండో రోజు అనారోగ్య కారణాలతో మరో ఐదు కోడెలు మరణించాయని పేర్కొన్నారు. కలెక్టర్ అధ్యక్షతన కోడెల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించి 500 పశువులకు ఎల్ఎస్‌డీ వ్యాక్సిన్ వేశామని, అనారోగ్యంతో ఉన్న 20 పశువులకు ప్రత్యేక చికిత్స అందించి, వాటిలో 16 పశువులను రక్షించామని తెలిపారు. మరో నాలుగు కోడెలు మరణించాయని తెలిపారు. గోశాలలో ఇప్పటివరకు 17కోడెలు అనారోగ్య పరిస్థితులతో మరణించాయని, మిగిలిన పశువులు ఆరోగ్యంగా ఉన్నాయని తెలిపారు. 64 కోడెలను స్థానిక రైతులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

కుర్మ సంఘ అధ్యక్షుడిగా రమేష్

ఇల్లంతకుంట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రనర్సుపల్లె గ్రామ కుర్మ సంఘ అధ్యక్షుడిగా చుక్క రమేష్ ఎన్నికయ్యారు. గ్రామంలోని సంఘ భవనంలో సమావేశం జరిగింది. ఉపాధ్యక్షుడిగా తొత్తిల్ల ఎల్లయ్య, కోశాధికారిగా తొత్తిల్ల అయిలయ్యలు ఎన్నిక కాగా, నూతన కార్యవర్గానికి గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

కళాకారులకు డప్పుల పంపిణీ

ఇల్లంతకుంట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తూరు గ్రామంలో కళాకారులకు డప్పులను జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు ఆదివారం పంపిణీ చేశారు. సిద్దం కొండయ్య స్మారకార్థకం డప్పులు అందజేసినట్లు గ్రామంలో జరిగే శుభ, అశుభ కార్యాలకు డప్పులు కొడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్దం శ్రీనివాస్, నర్సయ్య, అంజయ్య, గుంటి మధు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు పేదవారి ఆత్మగౌరవ ప్రతీక..

కోనరావుపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పేదవారి ఆత్మగౌరవ ప్రతిక ఇందిరమ్మ ఇల్లు అని కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ తాళ్లపెల్లి ప్రభాకర్ అన్నారు. కోనరావుపేట మండలం మల్కాపేట గ్రామంలో ఆదివారం మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసి మాట్లాడారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో పూర్తి చేసుకొని ప్రభుత్వం అందజేస్తున్న ఐదు లక్షలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కర్రల భాస్కర్, బొర్ర రవీందర్, కార్తీక్ గౌడ్, బోయిన దేవరాజు, కుంట వెంకటేష్, ఎదురుగట్ల అంజయ్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం..

చందుర్తి, జూన్ 1, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్‌పై ఎమ్మెల్సీ కవిత అవమానకరంగా మాట్లాడటం చాలా బాధాకరమని, ఆమె మాటలు తెలంగాణ విశ్వబ్రాహ్మణ జాతిని కించపరిచే విధంగా ఉన్నాయని చందుర్తి విశ్వబ్రాహ్మణ గ్రామ శాఖ అధ్యక్షుడు చిలుముల హన్మయ్యాచారి అన్నారు. చందుర్తిలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడిన మాటలు యావత్ తెలంగాణ విశ్వబ్రాహ్మణలు ముక్తకంటంతో ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రవీందర్, బ్రహ్మచారి, విష్ణు, శ్రీకాంత్, బ్రహ్మచారి, రఘురాం విశ్వబ్రాహ్మణ సోదరులు పాల్గొన్నారు.

రామన్నపేట రెడ్డి సంఘం అధ్యక్షుడిగా మహిపాల్‌రెడ్డి

బోయినపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం రాళ్ల రామన్నపేట గ్రామ రెడ్డి సంఘ కార్యవర్గాన్ని ఆదివారం రోజున ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షుడిగా మిట్టపల్లి మహిపాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడుగా చింతలపల్లి మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గుడి తిరుపతిరెడ్డి, జనరల్ సెక్రటరీగా చింతలపల్లి భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా సింగిరెడ్డి లచ్చిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఏనుగు జనార్ధన్ రెడ్డి, అన్నటి బాల్రెడ్డి, ముసుకు మనోహర్ రెడి, మిట్టపల్లి లచ్చిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆకట్టుకున్న విన్యాసాలు

రుద్రంగి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇందిరాచౌక్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాధనాశూరుల మూఢనమ్మకాలపై విన్యాసాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం సభ్యులు, సాధనాశూరులు మాట్లాడుతూ మంత్రాలు, తంత్రాలు లేవని, చేతబడులు, మూఢనమ్మకాలను నమ్మవద్దని ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు బాసని ఓం ప్రకాష్, నాయకులు పడాల శంకరయ్య, పిల్లామారపు ప్రవీణ్, మంచె రమేష్, సంఘ సభ్యులు, సాధనాశూరులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

మంగళపల్లె మున్నూరు కాపు సంఘం కార్యవర్గం

కోనరావుపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మంగళపల్లి మున్నూరు కాపు కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా వెలిశాల రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సాగర్ల రాజిరెడ్డి, క్యాషియర్ బాదినేని నారాయణ, కోశాధికారి బాదినేని నర్సయ్య, కార్యవర్గ సభ్యులుగా వెలిశాల శ్రీనివాస్, కొమిరెడ్డి అంజయ్య, ఉప్పుల రాములు, కొమిరెడ్డి అంజయ్య, దేవయ్య, ఉప్పుల రెడ్డిలు ఎన్నికయ్యారు.

క్రీడలతో క్రమశిక్షణ పెరుగుతుంది



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్సై అశోక్

రుద్రంగి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువత క్రీడల్లో మరింత రాణించాలని, క్రీడల వల్ల క్రమశిక్షణ పెరుగుతుందని ఎస్ఐ అశోక్ అన్నారు. రుద్రంగి మండలం కేంద్రంలోని పాఠశాల ఆవరణలో సమ్మర్ క్యాంప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుద్రంగి, చందుర్తి మండలాల వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, నాయకులతో కలిసి ఎస్ఐ అశోక్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడానికి రెండు మండలాల టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. మొదటి బహుమతి రుద్రంగి స్పోర్ట్స్ క్లబ్, రెండో బహుమతి సమ్మర్ క్యాంప్ టీంలు గెలుపొందాయని నిర్వాహకులు దేవయ్య తెలిపారు. స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గంగం మహేష్, సీనియర్ క్రీడాకారులు కర్ణవత్తుల చందు, తిగుల శ్రీనివాస్, దేశవేని శ్రీనివాస్, దయ్యాల శ్రీను, అంబటి శ్రీనివాస్, గుగ్గిల్ల తిరుపతి, అరిపెల్లి రవి, కాదాసు రవిలతో పాటు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సుద్దాల మాదిగ కుల సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

కోనరావుపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం సుద్దాల మాదిగ కుల సంఘం కార్యవర్గమైంది. ఆదివారం అంబేద్కర్ భవనంలో జరిగింది. అధ్యకుడిగా దండు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దొబ్బల దేవయ్య, కార్యవర్గ సభ్యులుగా దోబ్బల ఆమోస్, డి.నరేష్, డి.రాజయ్య, కాంతయ్య, ఉద్యానపు రాజయ్య, డి.దేవనర్సు, డి.రాజయ్య, దండు దాసులు ఎన్నికయ్యారు.

పారిశ్యుధ్య కార్మికులకు సన్మానం

గంభీరావుపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ పారిశ్యుధ్య కార్మికులను పురోహితుడు రాచర్ల పార్థసారథిశర్మ ఆదివారం సన్మానించారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడడం కోసం నిత్యం శ్రమిస్తున్నందుకు పారిశ్యుధ్య కార్మికులకు సన్మానించినట్లు పార్థసారథిశర్మ తెలిపారు.

సిరిసిల్లలో 'బద్మాషులు' సినీ బృందం సందడి



సమావేశంలో మాట్లాడుతున్న సినీ బృందం సభ్యులు

సిరిసిల్ల రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలో ఆదివారం బద్మాషులు సినిమా నటులు సందడి చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శంకర్ చేకూరి దర్శకత్వంలో మహేష్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్‌గౌడ్ నేతృత్వంలో నిర్మించిన బద్మాషులు సినిమా ఈనెల 6న విడుదలవుతుందని ప్రకటించారు. తారాస్టోరీ టెల్లర్స్ బ్యానర్‌పై బాలకృష్ణ శ్రీరామ శంకర్‌లు రూపొందించిన చిత్రం ఫస్టులుక్, టీజర్‌లకు మంచిస్పందన వచ్చిందని తెలిపారు. సిరిసిల్ల పట్టణానికిచెందిన కారంపురి విద్యాసాగర్, మురళీధర్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి ప్రధాన తారగణంతో ఈనెల 6న విడుదలైయ్యే ఈ సినిమాను అందరించి కొత్త నటినటులకు అవకాశం ఉండేలా చూడాలని కోరారు. నటీనటులు, చిత్రం యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

మరపురాని స్మృతులెన్నో..



సిరిసిల్లలో జన చైతన్య యాత్రలో అద్వానీ





ఉద్యమంలో కేటీఆర్, రోడ్డుపైనే మహిళల వంటా వార్పు

(3వ పేజీ తరువాయి)

జనుల సమ్మెలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, జర్నలిస్టులు, డాక్టర్లు, లాయర్లు, మహిళలు, యువకులు, అన్ని కుల సంఘాలు ర్యాలీలు, ధర్నాలతో ఉద్యమంలో పాల్గొన్నారు. 2011లో జనచైతన్య యాత్రతో సిరిసిల్లకు వచ్చిన బీజేపీ అగ్రనేత అద్వానీ ముందు తెలంగాణ నినాదాల హోరును హోరెత్తించారు. అద్వానీ తెలంగాణ ఆకాంక్షను గుర్తించానని ప్రకటించారు. రాజకీయ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు 100 రోజుల పాటు సాగిపోయాయి. ప్రతిరోజు వివిధ కుల సంఘాల ర్యాలీలు, బతుకమ్మ ఆటలు, బోనాల పండుగలు, వంటా వార్పులతో తెలంగాణ ఉద్యమ ఉధృతిని చాటారు. తెలంగాణ ద్రోహుల దిష్టిబొమ్మలు దహనం.. రాస్తారోకోలు లేని రోజులే లేవు.. విద్యార్థుల భారీ ర్యాలీలు తెలంగాణ ఆకాంక్షకు మరింత బలాన్ని ఇచ్చింది. తెలంగాణ ఉద్యమంలో భాగంగా ప్రజా గాయకుడు గద్దర్, విమలక్కతో పాటు ఎంతో మంది గాయకులు సిరిసిల్లలో ధూంధాంలు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేస్తూ ఇంటర్మీడియట్ చదివే విద్యార్థి వెంకటేశం, గాయకుడు తిరుపతి రెడ్డి, కార్మికుడు శ్రీనివాస్‌తోపాటు పలువురు బలిదానం చేయడంతో ఉద్యమం ఉధృతంగా మారడానికి దోహదపడింది.

తెలంగాణ పోరులో పిడికిలెత్తిన మహిళ..

ఆనాడు స్వాతంత్ర్య పోరు... నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా సిరిసిల్ల మహిళలు ధిక్కార స్వరాన్ని వినిపించారు. 1935లో సిరిసిల్లలో ఆంధ్రా మహిళ సభ మాడపాటి మాణిక్యమ్మ, ఎల్లప్రగడ సీతాదేవి లాంటి వారే నిర్వహించిన సభతో మహిళా ఉద్యమస్ఫూర్తిని ఆనాడు చాటితే.. అదే స్ఫూర్తితో తెలంగాణ పోరులో సిరిసిల్ల మహిళలు పిడికిలెత్తారు. తమ ఆందోళన ఫలితం పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లుతో సాకారం కావడంతో సిరిసిల్ల మహిళ ఆనందంతో ఉప్పొంగిపోతోంది. తెలంగాణ ఉద్యమంలో తాము పోషించిన పాత్రను మరోసారి గుర్తు చేసుకుంటూ జ్ఞాపకాలను పంచుకుంటున్నారు. తెలంగాణ సాధన కోసం మేమున్నామంటూ కొంగును నడుముకు చుట్టి బతుకమ్మలు, బోనాలతో ఆందోళన పథంలోకి అడుగులు అడుగులు వేశారు. సిరిసిల్లలో దాదాపు 20వేల మంది మహిళలు భారీ ర్యాలీ నిర్వహించి రాష్ట్రంలోనే సిరిసిల్ల మహిళ శక్తిని చాటారు. రోడ్డుపైనే వంటావార్పులు, రిలేదీక్షలు, రాస్తారోకోలు కేవలం మహిళలు మాత్రమే నిర్వహించడం విశేషంగా చెప్పుకోవచ్చు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు నిలయమే కాదు పోరాటాలకు కేంద్రంగా కూడా చాటి చెబుతున్నారు. తెలంగాణ సాయుధ పోరులో తనకంటూ ప్రత్యేకతను నిలుపుకున్న సిరిసిల్ల మహిళలు తెలంగాణ ఉద్యమంతో సిరిసిల్లను ముఖ్య భూమికగా నిలిపారు. మహిళ ప్రజాప్రతినిధులే కాకుండా బీడీలు చుట్టే అక్కలు, నాట్లు వేసే చెల్లెళ్లు కూడా రోడ్డెక్కి ఉద్యమపోరులో నిలుస్తున్నారు. సిరిసిల్ల గాంధీచౌక్‌ను కేంద్రంగా మహిళలు నిర్వహించిన పోరాటాలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ఏదో రూపంలో మహిళలు తమ పోరును కొనసాగించారు.

కలెక్టరేట్‌లో వేడుకలకు ఏర్పాట్లు..

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అధికారికంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను నిర్వహించడానికి ఏర్పాట్లుచేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు అమరవీరుల స్తూపం వద్ద నివాళులు, 9.30 గంటలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. 9.38 నిముషాలకు ప్రభుత్వ విప్ తన సందేశాన్ని ఇస్తారు.









సిరిసిల్లలో గద్దర్, దీక్షలో పాల్గొన్న మహిళలు, వంద రోజుల దీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు, సిరిసిల్లలో భారీ ర్యాలీ

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం రూపొందించిన భూ భారతి చట్టంలో భాగంగా జిల్లాలో ఈనెల 3వ తేది నుంచి గ్రామాలవారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తామని ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్నిమండలాల్లో 3వ తేది నుంచి 20వ తేది వరకు నిర్వహించే గ్రామాల రెవెన్యూసదస్సుల షెడ్యూల్‌ను విడుదల చేశారు. బోయినపల్లి మండలంలో 3న దుంద్రపల్లి, విలాసాగర్, 4న అనంతపల్లి విలాసాగర్, 5న మల్కాపూర్, వర్ధవెల్లి, 6న తడగొండ వర్ధవెల్లి, 9న కోరెం, కొదురుపాక, 10న కోరెం నర్సింగాపూర్, 11న బూర్గుపల్లి, నర్సింగాపూర్, 12న స్తంబంపల్లి, కొత్తపేట, 13న స్థంబంపల్లి మాన్వాడ, 16న బోయినపల్లి, మల్లాపూర్, 17న బోయినపల్లి, చందుర్తి మండలంలో 3న అనంతపల్లి, తిమ్మాపూర్, 4న మూడపల్లి, తిమ్మాపూర్, 5న మూడపల్లి, లింగంపేట, 6న మర్రిగడ్డ, జోగాపూర్, 9న బండపల్లి, సనుగుల, 10వ తేదిన సనుగుల బండపల్లి, 11న చందుర్తి, ఏన్గల్, 12న చందుర్తి, మల్యాల, 13న చందుర్తి, మల్యాల, ఇల్లంతకుంటలో 3న ముస్కానిపేట, రామోజీపేట, 4న జవారిపేట, తిప్పాపూర్, 5న గాలిపెల్లి, జంగమరెడ్డిపల్లె, 6న గాలిపల్లి, సిరికొండ, 9న తాళ్లపల్లి, ఇల్లంతకుంట, 10న పొత్తూర్, పెద్దలింగాపూర్, 11న పొత్తూర్, అనంతారం, 12న కందికట్కూర్, అనంతగిరి, 13న కందికట్కూర్, రేపాక, 16న వంతడ్పుల, రేపాక, 17న ఓగులాపూర్, రేపాక, 18న వల్లంపట్ల, రేపాక, 19న రహీంఖాన్‌పేట, దాచారం, 20న వెల్జీపూర్, దాచారం, గంభీరావుపేటలో 3న కుర్దులింగంపల్లి, రామంజపురం, 4న దమ్మన్నపేట, మల్లారెడ్డిపేట, 5న గోరంటాల, లింగన్నపేట, 6న ముస్తాఫానగర్, లింగన్నపేట, 9న సముద్రలింగాపూర్, ముచ్చర్ల, 10 సముద్రలింగాపూర్, శ్రీగాధ, 11 శ్రీనివాసనగర్, కోళ్లమద్ది, 12న గంభీరావుపేట, నర్మాల, 13న గంభీరావుపేట, దేశాయిపేట, 16న గజసింగవరం, కొత్తపల్లి, 17న లక్ష్మీపూర్, కొత్తపల్లి, కోనరావుపేటలో 3న కోలనూర్, బావుసాయిపేట, లచ్చపేట, 4న మర్తనపేట, వట్టిమల్ల, 5న ధర్మారం, కనగర్తి, 6న మల్కపేట, నిజామాబాద్, 9న కోనరావుపేట, మామిడిపల్లి, 10న కోనరావుపేట, మరిమడ్ల, 11న రామన్నపేట, నిమ్మపల్లి, 12న నాగారం,సుద్దాల, 13న శివంగలపల్లి, పల్లిమక్త, 16న వెంకట్రావుపేట, 17న కొండాపూర్, ముస్తాబాద్‌లో 3న చిప్పలపల్లి, కొండాపూర్, 4న నామాపూర్, తుర్కపల్లి, 5న మద్దికుంట, అవునూర్, 6న బందనకల్, గూడూరు, 9న మొర్రాపూర్, గూడెం, 10న చీకోడ్, మోయినికుంట, 11న మొర్రాయిపల్లె, తెర్లమద్ది, 12న ముస్తాబాద్, పోత్గల్, సిరిసిల్లలో 3న బోనాల, ముష్టిపల్లి, 4న సర్దాపూర్, పెద్దూర్, 5న సిరిసిల్ల, 6న సిరిసిల్ల, తంగళ్లపల్లిలో 3న చింతల్‌ఠాణా, గండిలచ్చపేట, 4న చీర్లవంచ, వేణుగోపాల్‌పూర్, 5న నర్సింహులపల్లె, కస్బెకట్కూర్, 6న తంగళ్లపల్లి బద్దెనపల్లి, 9న మండెపల్లి, ఓబులాపూర్, 10న బస్వాపూర్, సారంపల్లి, 11న రామచంద్రపూర్, నేరేళ్ల, 12న తాడూర్, జిల్లెల్ల, 13న జిల్లెల్ల, తాడూర్, వేములవాడ అర్బన్‌లో 3న శాత్రాజుపల్లి, సంకెపల్లి, 4న మారుపాక, చంద్రగిరి, 5న నాంపల్లి, తెట్టెకుంట, 6న వేములవాడ తిప్పాపూర్, వేములవాడ రూరల్‌లో 3న జయవరం, ఎదురుగట్ల, 4న మల్లారం, చెక్కపల్లి, 5న హన్మాజీపేట, నూకలమర్రి, 6న బొల్లారం, నూకలమర్రి, 9న లింగంపల్లి, వట్టెంల, 10న మర్రిపల్లివట్టెంల, 11న మర్రిపల్లి, ఫాజుల్‌నగర్, 12న వెంకటాయపల్లి, కోడుముంజ, 13న రుద్రవరం, అనుపురం, వీర్నపల్లిలో 3న అడవి పదిర, మద్దిమల్ల, 4న కంచర్ల, గర్జనపల్లి, 5న వీర్నపల్లి, గర్జనపల్లి, 6న వీర్నపల్లి, వన్‌పల్లి, ఎల్లారెడ్డిపేటలో 3న అల్మాస్‌పూర్ గొల్లపల్లి, 4న అల్మాస్‌పూర్, గొల్లపల్లి, 5న వెంకటాపూర్, రాజన్నపేట, 6న పదిర, అక్కపల్లి, 9న పదిర, నారాయణపూర్, 11న దుమాల, తిమ్మాపూర్, 12న బండలింగంపల్లి, తిమ్మాపూర్, 13న కోరుట్లపేట, బొప్పాపూర్, 16న ఎల్లారెడ్డిపేట సర్వాయిపల్లి, 19న ఎల్లారెడ్డిపేట గుండారం గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదస్సులను అధికారులు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సదస్సుకు వచ్చే ప్రజలు భూసమస్యలకు సంబంధించిన ఒరిజినల్, జిరాక్స్ పత్రాలను తీసుకరావాలని, మొబైల్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



నర్సక్కపేటలో బోనాలతో వెళుతున్న మహిళలు



రామన్నపేటలో బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

ఇల్లంతకుంట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సక్కపేట, గాలిపెల్లి, పొత్తూరు గ్రామాల్లో ఘనంగా పోచమ్మ బోణాలు తీశారు. సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ బోనాలు తీశారు. డప్పుచప్పుళ్ల, శివసత్తుల పూనకాల మధ్య మహిళలు బోనాలు ఎత్తుకొని ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ర్యాగటి శిరీషచంద్రశేఖర్, ఏఎంసీ డైరెక్టర్ దారం నర్సింహ్మారెడ్డి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కొత్త శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలోని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎడ్లబండ్లను అందంగా అలంకరించారు. వీధుల గుండా భారీ ప్రదర్శన తీశారు. గ్రామ దేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. బైండ్ల వారి డప్పుచప్పుళ్ల నడుమ మహిళలు బోనాలతో నృత్యాలుచేశారు. బోనాలు తీసి దేవతలకు సమర్పించారు. వివిధ పార్టీల నాయకులు పోచమ్మ ఆలయంలో ప్రత్యకపూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. చక్రధర్‌రెడ్డి, నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, బుచ్చాగౌడ్, రెడ్డి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. కాగా, వర్షాలు సమృద్ధిగా కురువాలని వేడుతూ మండల కేంద్రంలోని రైతులు ఆదివారం బండ్ల బోనాల ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల నడుమ గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. బోనాలను తీసి గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రైతులు, స్థానికులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : చల్లగా చూడు పోచమ్మ తల్లీ... అంటూ కోనరావుపేట మండలంలోని రామన్నపేట గ్రామస్తులు పోచమ్మ తల్లి బోనాల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనం నెత్తిన పెట్టుకొని డప్పు చప్పుళ్ల మధ్య పోచమ్మ ఆలయం వద్దకు వెళ్లి నైవేద్యం చెల్లించి ముక్కులు తీర్చుకున్నారు. తమ పాడిపంటలు, కుటుంబ సభ్యులు బాగుండాలని వేడుకున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సిరిసిల్లలో సమావేశమైన పూర్వ విద్యార్థుల



గోరంటాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

సిరిసిల్ల రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లలో పూర్వ విద్యార్థులు 25సంవత్సరాల తర్వాత కలుసుకుని ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని వివేకంద విద్యానికేతన్‌లో 1998-1999లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులందరు ఓ ఫంక్షన్‌హాలో 25సంవత్సరాల తర్వాత కలుసుకుని ఆత్మీయ సమ్మేళానాన్ని జరుపుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి పాఠశాల కరస్పాండెంట్ లింగారెడ్డి తోపాటు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

గంభీరావుపేట : గంభీరావుపేట మండలం గోరంటాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. 2003-2004 సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు వాళ్ళు చదివిన పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆత్మీయతను చాటుకున్నారు. అనంతరం చదువు నేర్పిన గురువులను సన్మానించారు.

పాఠశాల పూర్వ వైభవానికి కృషి

- సమావేశమైన పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు



సమావేశంలో పాల్గొన్న గ్రామస్థులు, ఉపాధ్యాయులు

గంభీరావుపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఎంతో మందికి విద్యాబుద్దులు నేర్పి, ఎందరినో ఉన్నత శిఖరాలకు తీర్చిదిద్దిన బడి భవిష్యత్ కోసం గ్రామస్థులు ఏకమయ్యారు. సర్కారు బడుల్లో సౌకర్యాలపై ప్రచారం చేసి, బడికి పూర్వవైభవం తెద్దామంటూ గ్రామస్థులు ఒక్కటయ్యారు. గ్రామస్తులకు తోడు గ్రామ అబివృద్ధి కమిటీ, ఉపాధ్యాయులు ఈ పాఠశాలలో చదివి ఎదిగిన పలువురు ఉద్యోగులు, వృత్తి నిపుణులు, పూర్వ విద్యార్థులు, బడి బాగు కోసం సమావేశమయ్యారు. గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 8 వరకు తరగతులు ఉన్నాయి. ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రైవేటు పాఠశాల కారణంగా రోజురోజుకు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఒకప్పుడు 200 పైగా విద్యార్థులతో కలకళలాడిన పాఠశాలలో విద్యార్థుల సంఖ్య కేవలం 54కి చేరింది. దీంతో పాఠశాలలో ఆదివారం గ్రామస్థులు, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, ఉద్యోగులు సమావేశమై పాఠశాల భవిష్యత్‌పై చర్చించారు. పాఠశాలకు తిరిగి పూర్వవైభవం తెచ్చేందుకు సమాలోచనలు చేశారు. పాఠశాల నుంచి వెళ్లిపోయిన విద్యార్థులతో పాటు మరి కొందరు విద్యార్థులను పాఠశాలలో చేర్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. సర్కారు బడిలో ఉన్న సౌకర్యాలపై ఇంటింటికి వెళ్లి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ ప్రచారం చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు.

ఘనంగా బీసీ ఉద్యమ నేత జన్మదిన వేడుకలు



పర్శ హన్మాండ్లుకు శుభాకాంక్షలు తెలుపుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

సిరిసిల్ల టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యమ నేత పర్శ హన్మాండ్లు జన్మదిన వేడుకలను బీసీ సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో, రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పర్శ హన్మాండ్లును సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. పర్శ హన్మాండ్లు జన్మదిన వేడుకలు హైదరాబాదులో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. బీసీల హక్కుల సాధన కోసం జైలు జీవితాన్ని అనుభవించిన గొప్ప వ్యక్తి పర్శ హన్మాండ్లు అని అన్నారు. అయన మునుముందు ఎన్నో పదవులు అధిరోహించాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆకాంక్షించారు,

వంతెన నిర్మాణంపై నిర్లక్ష్యం

- రెండేళ్లుగా నిలిచిన నిర్మాణ పనులు

- నిరసన వ్యక్తం చేసిన స్థానికులు



వంతెన వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అదనపు టీఎంసీ కోసం నిర్మిస్తున్న కాలువపై వంతెన నిర్మాణం తక్షణమే చేపట్టాలని బీఆర్ఎస్ నాయకుడు జక్కుల నాగరాజ్ యాదవ్, స్థానిక ప్రజలు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తంగళ్ళపల్లి మండలంలోని చీర్లవంచ-వల్లంపట్ల గ్రామాల మధ్య టీఎంసీ కోసం కాలువ నిర్మాణ చేపట్టారు. దీంట్లో భాగంగా కెనాల్‌పై వంతెన నిర్మాణం ఎన్నికలు తదితర అంశాలతో కొంతమేర పూర్తి చేసి మధ్యలోనే వదిలిపెట్టారు. దీంతో ఇల్లంతకుంట మండలంలోని 10గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వంతెన నిర్మాణం పూర్తి చేయడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తక్షణమే పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పనులు పూర్తయ్యేలా ఎమ్మెల్యే, కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు.